సాక్షి కామారెడ్డి

ఆదివారం । 14 । సెప్టెంబర్ । 2025



చిరుత పులి కలకలం

మద్నూర్‌లో చిరుత సంచరిస్తోందన్న ప్రచారంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. చిరుతను బంధించాలని డిమాండ్ చేస్తున్నారు.

- 8లో ▸



వరదలు మిగిల్చిన నష్టం

ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పంటలు దెబ్బతిన్నాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఆదుకోవాలని కోరుతున్నారు.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 29.5 /21.9

ఉదయం చల్లటి గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు జల్లులు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

'వైజ్ఞానిక ప్రదర్శనలతో సృజనాత్మకత పెరుగుతుంది'



కామారెడ్డి అర్బన్: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు ఉపయోగపడుతాయని డీఈవో రాజు పేర్కొన్నారు. కామారెడ్డిలోని శ్రీసరస్వతి విద్యామందిర్ హైస్కూల్‌లో ప్రారంభమైన మూడు రోజుల రాష్ట్ర స్థాయి గణిత విజ్ఞాన, సాంస్కృతిక మహోత్సవం కొనసాగుతోంది. శనివారం రెండోరోజు కార్యక్రమంలో డీఈవో మాట్లాడుతూ విద్యార్థుల బహుముఖ వికాసానికి ఉపయోగపడే విధంగా సాంస్కృతిక, గణిత విజ్ఞాన ప్రదర్శన నిర్వహించడం బాగుందన్నారు. పట్టణంలోని వాగ్దేవి, ఎస్‌పీఆర్, ఆర్చిడ్స్, లిటిల్ స్కాలర్స్ హైస్కూళ్లతో పాటు ఆయా పాఠశాలల విద్యార్థులు విజ్ఞాన ప్రదర్శనను సందర్శించి వివిధ అంశాలను అడిగి తెలుసుకున్నారు. శ్రీ సరస్వతి విద్యాపీఠం ప్రాంత శైక్షణిక్ ప్రముఖ్ నల్లాన్‌చక్రవర్తుల కృష్ణమాచార్యులు, స్థానిక సరస్వతి విద్యామందిర్ ప్రతినిధులు గంగారెడ్డి, హరిస్మరణ్‌రెడ్డి, గీరెడ్డి రాజారెడ్డి, రంజిత్‌మోహన్, భాస్కర్‌రావు, గోవర్ధన్‌రెడ్డి, ప్రిన్సిపల్ నాగభూషణం, అకడమిక్ ప్రిన్సిపల్ నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

'మరమ్మతులు చేపట్టాలి'



కామారెడ్డి క్రైం : భారీ వర్షాలు, వరదలకు దెబ్బతిన్న మౌలిక వసతులకు సంబంధించిన మరమ్మతులను వెంటనే చేపట్టాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలో పర్యటించిన ఆయన.. దెబ్బతిన్న రోడ్లు, ఇతర వసతులను పరిశీలించారు. హౌసింగ్ బోర్డు ప్రాంతంలోని వైకుంఠధామం వద్ద జరుగుతున్న రోడ్డు మరమ్మతులు, నీటి సరఫరా జరిగే ఫిల్టర్ బెడ్‌లను సందర్శించారు. పునరుద్ధరణ పనులను వేగంగా చేపట్టాలని ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి శాశ్వత పరిష్కారాలకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో వీణ, మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి, మున్సిపల్ ఏఈ శంకర్, అధికారులు వేణుప్రసాద్, డీటీ రవికుమార్, ఆర్ఐ నర్సింహారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

'సమయ పాలన పాటించాలి'



ఎల్లారెడ్డిరూరల్: అంగన్‌వాడీ కేంద్రాలలో సమయపాలన పాటించాలని జిల్లా సంక్షేమ అధికారి ప్రమీల సూచించారు. శనివారం అన్నాసాగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. చిన్నారులకు ఆటపాటల ద్వారా విద్యాబోధన చేయాలని సూచించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా అంగన్‌వాడి కేంద్రానికి సంబంధించిన భవనం పైకప్పునుంచి నీరు కారినందున వేరే భవనంలోకి మార్చేలా చూడాలని గ్రామస్తులు జిల్లా అధికారిని కోరారు. కార్యక్రమంలో ఏసీడీపీవో ప్రసన్న, అంగన్‌వాడీ టీచర్ దుర్గ తదితరులు పాల్గొన్నారు.

'సిమి, పీఎఫ్ఐలకు నిజామాబాద్ అడ్డా'

ఖలీల్‌వాడి(నిజామాబాద్ అర్బన్): సిమి, పీఎఫ్ఐ వంటి సంస్థలకు నిజామాబాద్ అడ్డాగా మారిందని ఎంపీ ధర్మపురి అర్వింద్ ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని డీఐజీ కార్యాలయంలో శనివారం సీపీ పోతరాజు సాయిచైతన్యతో ఎంపీ సమావేశమయ్యారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. వినాయక నిమజ్జనానికి సంబంధించిన ఫొటోను సోషల్ మీడియాలో పోస్టు చేసిన యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. ఈ సందర్భంగా ఓ వర్గానికి చెందిన సుమారు 400 మంది బైక్ ర్యాలీ నిర్వహించి, హారన్ కొడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తే మాత్రం పోలీసులు కేసు పెట్టలేదన్నారు. తాను పోలీసులతో మాట్లాడిన తర్వాత ర్యాలీకి బాధ్యత వహించిన వారిపై కేసులు నమోదు చేశారన్నారు. తప్పు చేసిన వారి విషయంలో మత ప్రస్తావన ఎందుకు తీసుకు వస్తున్నారని ప్రశ్నించారు. హిందువుల పండుగలకు ఆంక్షలు ఎక్కువయ్యాయన్నారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు, ఉగ్ర కార్యకలాపాలపై కఠినంగా వ్యవహరించాలని సీపీని కోరినట్లు తెలిపారు.

ఇంటి పేరు.. సమ్‌థింగ్ స్పెషల్

కుటుంబ వ్యవస్థకు పునాదిగా ఉన్న మన దేశంలో ఒక్కో కుటుంబానికి ఒక్కో ఇంటి పేరుంటుంది. ఇంటి పేరుతోనే ఆ కుటుంబాలకు గుర్తింపు లభిస్తుంది. తాతల కాలం నుంచి ఇది ఆనవాయితీగా వస్తోంది. తరువాతి తరాలకూ కొనసాగుతుంది. ఇదే సమయంలో ఆడపిల్లకు పెళ్లయ్యేదాకా తల్లిదండ్రుల ఇంటి పేరు ఉండగా.. అత్తారింట అడుగుపెట్టిన తరువాత అది మారిపోతుంటుంది. కొందరి ఇంటి పేర్లు చాలా ప్రత్యేకంగా ఉంటాయి. ఇంకొన్ని గమ్మత్తుగానూ ఉంటాయి. జిల్లాలో పలువురికి పక్షులు, జంతువులు, వృక్షాలు, కూరగాయలు, పువ్వులు, ఆకులు, ఆహార పదార్థాలు.. ఇలా పలు రకాల పేర్లు ఇంటి పేర్లుగా ఉన్నాయి.

– సాక్షి ప్రతినిధి, కామారెడ్డి



సండే స్పెషల్

కాదేదీ సర్‌నేమ్‌కు అనర్హం

- మారుపేరుగా పక్షులు, జంతువులు, చెట్లు, పువ్వుల పేర్లు
- ఉప్పు, పప్పు, కారం, కూరగాయలతోనూ ఇంటి పేరు..
- తరతరాలుగా ఆయా పేర్లతోనే పిలుచుకుంటున్న జనం

పక్షులు, జంతువుల పేర్లే ఇంటి పేర్లుగా...

చాలా గ్రామాల్లో ఇంటి పేర్లు పక్షులు, జంతువుల పేరుతో ఉన్నాయి. పలువురికి అడవి జంతువులైన ఏనుగు, పులి, నక్క వంటి ఇంటి పేర్లున్నాయి. అలాగే కుక్కల, ఎలుక, ఉడుత, చిలుక, కొంగ, కొంగల, కోతి, కాకి, బాతు, నెమలి అన్న పేర్లూ ఉన్నాయి. వ్యవసాయంలో ఒకప్పుడు కీలకంగా ఉన్న ఎద్దు సైతం చాలామందికి ఇంటిపేరుగా ఉంది. మేక, మేకల, గుర్రం, గొర్రెల, పిల్లి, పంది, పోతుల, పోతరాజు, పాముల.. ఇలా అనేక రకాల ఇంటి పేర్లు ఉన్నాయి.

శరీర భాగాలు..

కొన్ని కుటుంబాల ఇంటి పేరు శరీరంలోని అవయవాలనుంచి వచ్చింది. కొందరి మారుపేరు బొడ్డు, ముక్కు అని ఉంది. మీసాల, గడ్డం, గడ్డంవార్, గోరు, గోళ్ల పేరుతోనూ ఇంటి పేర్లున్నాయి.

కూరగాయలు, పంటల పేర్లు సైతం...

రోజూ మనం తినే కూరగాయలు, ఇతర పంటల పేర్లే ఇంటి పేరుగా కలిగిన కుటుంబాలు చాలా ఉన్నాయి. వంకాయల, మిరపకాయల, తోట, తోటకూర, చామకూర, గుమ్మడి, పసుపు, పాలకూర, పాలమాకుల వంటి పేర్లున్నాయి. కంది, కందుల, జొన్న, జొన్నల, పసుపు, పసుపునూరి, అల్లం, ఆలుగడ్డ, పోకల, గుమ్మడి, పత్తి, ఆముదాల, సామల, మక్కల వంటి పేర్లు చాలా కుటుంబాలు ఇంటి పేరుగా కలిగి ఉన్నాయి.

చెట్లు, పువ్వులు..

చెట్లు, పువ్వులనుంచీ చాలా మందికి ఇంటి పేరు వచ్చింది. చింత, చింతల, కొబ్బరికాయ, ఇప్పకాయ, మామిడి, మామిండ్ల, నిమ్మ, నిమ్మల, జీడి, తాటి, తాటికాయల, తాటిపాముల, తాళ్ల వంటి పేర్లతోపాటు వేప, యాప పేర్లు కూడా ఇంటి పేర్లుగా మారాయి. మల్లెల, మల్లెపూల, చామంతి, చామంతుల, గన్నేరు పేర్లు కూడా ఉన్నాయి.

రోజూ తినే, వాడుకునే వస్తువులు...

ఉప్పు లేని కూర ఒప్పదు రుచులకు అనే సామెత వినే ఉంటాం. ఎందుకంటే ఉప్పు ఉంటేనే రుచి ఉంటుంది. ఉప్పు పేరు ఇంటి పేరుగా ఎన్నో కుటుంబాలు కలిగి ఉన్నాయి. ఉప్పుతో పాటు ఉప్పల అనే పేరు కూడా ఉంది. పప్పు, పప్పుల అనే పేర్లతో పలువురికి ఇంటి పేర్లున్నాయి. నేతి కూడా ఇంటి పేరుగా ఉంది.

ఉడత పేరుతో..



మా ఇంటి పేరులో ఉడుత ఉంటుంది. మా ప్రాంతంలో ప్రతి ఇంటి పేరు పక్కన వార్ అని పెడతారు. అందుకే మా ఇంటి పేరు ఉడతవార్. ఉడత పేరు ప్రత్యేకమనే అనిపిస్తుంది.

– ఉడతవార్ సుభాష్, మద్నూర్

పులితో కొట్లాడిండ్రని..



తాతల కాలంనుంచి పులి ఇంటి పేరు వస్తోంది. వెనకట ఎవరో మా తాతలు పులితో కొట్లాడిండ్రని, అందుకే పులి ఇంటి పేరైందని చెబుతారు. ఇంటి పేరుతో ఎంతో గుర్తింపు లభించింది.

– పులి సాయన్న, రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్, కామారెడ్డి

ఏనుగు పేరుతో వేలాది కుటుంబాలు



ఏనుగు ఇంటి పేరుగా మన జిల్లాలోనే వేలాది కుటుంబాలు ఉన్నాయి. మా బంధువులు, కులం వాళ్లలో చాలామందికి ఈ ఇంటి పేరుంది. ఇంటి పేరు చెబితేనే సులువుగా గుర్తు పట్టొచ్చు.

– ఏనుగు రాంరెడ్డి, రిటైర్డ్ టీచర్, లక్ష్మీదేవిపల్లి

వంకాయల అంటే మేమే గుర్తుకొస్తం



ప్రతి ఒక్కరికీ ఇంటి పేరుతోనే గుర్తింపు లభిస్తుంది. మా ఇంటి పేరుతో కలిపి నన్ను అందరూ వంకాయల రవి అనే పిలుస్తారు. మా ఊళ్లో వంకాయల అంటే మమ్మల్నే గుర్తు చేసుకుంటారు.

– వంకాయల రవి, సదాశివనగర్

తాతల కాలంనుంచి..



మా ఇంటి పేరు కోతి. తాతల కాలం నుంచి ఇదే ఇంటి పేరు వస్తోంది. మా కుటుంబాల్లో కొందరి ఇంటి పేరు ముందు చిన్న కోతోళ్ల అని, మరికొందరికి పెద్ద కోతోళ్ల అని ఉంటుంది.

– కోతి మహేందర్‌రెడ్డి, సదాశివనగర్

రాజీయే రాజమార్గం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి వరప్రసాద్
- లోక్ అదాలత్‌లో 2,294 కేసుల పరిష్కారం



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీహెచ్ వీఆర్ఆర్ వరప్రసాద్

కామారెడ్డి టౌన్ : రాజీయే రాజమార్గమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ సీహెచ్ వీఆర్ఆర్ వరప్రసాద్ పేర్కొన్నారు. శనివారం జిల్లాలోని కోర్టులలో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని కోర్టులో ఆయన మాట్లాడారు. లోక్ అదాలత్‌లో బ్యాంక్, క్రిమినల్, సివిల్, కుటుంబ, ఆయా కేసులకు సంబంధించి కక్షిదారులు ఇరువర్గాలు రాజీ చేసుకుని రాజమార్గంలో కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకుని కక్షిదారులు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. కమ్యూనిటీ మధ్యవర్తిత్వ కేంద్రాల ద్వారా కూడా ప్రజలకు పరిష్కారాలు లభించే అవకాశాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కల్పిసుందని వివరించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి.నాగరాణి, సీనియర్ సివిల్ జడ్జి సురా సుమలత, సివిల్ జడ్జి సుధాకర్, అదనపు జూనియర్ సివిల్ దీక్ష, ద్వితీయ శ్రేణి మెజిస్ట్రేట్ చంద్రశేఖర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నంద రమేశ్, అదనపు ఎస్పీ నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిది బెంచీల ద్వారా..

జిల్లావ్యాప్తంగా ఎనిమిది లోక్ అదాలత్ బెంచీల ద్వారా మొత్తం 2,294 కేసులకు పరిష్కారం చూపినట్లు న్యాయమూర్తులు తెలిపారు. ఇందులో క్రిమినల్ కేసులు 2,162, సివిల్ 24, సైబర్ క్రైం 23, బ్యాంక్ 80, మోటార్ అక్సిడెంట్ క్లయిమ్ 5 కేసులు ఉన్నాయన్నారు. బాధితులకు నష్టపరిహారంగా రూ. 1,52,18,066 అందజేశామని పేర్కొన్నారు.

చుట్టం చూపుగా వచ్చి చోరీలు

- రాజస్థాన్‌కు చెందిన నిందితుడి అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఎస్పీ రాజేశ్ చంద్ర



కేసు వివరాలు తెలుపుతున్న ఎస్పీ రాజేశ్ చంద్ర

కామారెడ్డి క్రైం: చుట్టం చూపుగా వచ్చి, అనుమానం రాకుండా వాహనానికి తెలంగాణ నంబర్ ప్లేట్ పెట్టుకుని చోరీలకు పాల్పడుతున్న రాజస్థాన్‌కు చెందిన ఓ నిందితుడిని కామారెడ్డి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ రాజేశ్ చంద్ర తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గతనెల 25 న జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్ కాలనీకి చెందిన మాసిరెడ్డి శివారెడ్డి కుటుంబం ఇంటికి తాళం వేసి దైవదర్శనం కోసం వేములవాడకు వెళ్లింది. మరుసటి రోజు వచ్చి చూసేసరికి చోరీ జరిగినట్లు గుర్తించారు. ఇంట్లోని 19 తులాల బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా దర్యాప్తు చేశారు. శనివారం హౌసింగ్ బోర్డు కాలనీలో ఓ కారులో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని పోలీసులు పట్టుకుని వాకబు చేయగా హిందీలో మాట్లాడాడు. తెలంగాణ నంబర్ ప్లేట్ గల కారులో తిరుగుతూ హిందీలో మాత్రమే మాట్లాడడంతో అనుమానం వచ్చి అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించాడని ఎస్పీ తెలిపారు. నిందితుడిని రాజస్థాన్ రాష్ట్రంలోని కరోలీ జిల్లా అజీజ్‌పూర్ గ్రామానికి చెందిన హన్సరాజ్ మీనాగా గుర్తించారు. అతడు కొద్ది రోజుల క్రితం మెదక్ రైల్వే క్వార్టర్స్‌లో నివాసం ఉండే తన బంధువు ఇంటికి చుట్టం చూపుగా వచ్చాడని పేర్కొన్నారు. స్నేహితుడైన అభిషేక్‌తో కలిసి కామారెడ్డిలో తాళం వేసిన ఇంట్లో చోరీ చేశాడన్నారు. నిందితుడి వద్ద నుంచి 2 తులాల బంగారు ఆభరణాలు, చోరీకి ఉపయోగించిన కారు, సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులిద్దరిపై రాజస్థాన్‌లో అనేక దొంగతనం కేసులు ఉన్నట్లు తెలిసిందని, అక్కడి పోలీసులకు సమాచారం ఇచ్చామని పేర్కొన్నారు. నిందితులు చోరీ చేసిన ఇతర బంగారు ఆభరణాలను గుర్తించేందుకు, మరో నిందితుడు అభిషేక్‌ను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను పంపిస్తున్నామని తెలిపారు. కేసు ఛేదనలో విశేషంగా కృషి చేసిన అధికారులను అభినందించి రివార్డులను అందించారు. కార్యక్రమంలో ఏఎస్పీ చైతన్యరెడ్డి పాల్గొన్నారు.

యూరియా గోస తీరేది ఎప్పుడో?

- రోజూ సొసైటీల వద్దకు వస్తున్న రైతులు
- టోకెన్ల పంపిణీపై అసహనం.. రాళ్ల దాడి చేసిన గుర్తుతెలియని వ్యక్తి
- కానిస్టేబుల్‌కు గాయాలు
- పోలీసు స్టేషన్ వద్ద టోకెన్లను పంపిణీ చేసిన పోలీసులు



సొసైటీ వద్ద బారులు తీరిన రైతులు

బీబీపేట : రైతులకు యూరియా కష్టాలు తీరడం లేదు. వారాల తరబడి సమస్య కొనసాగుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. దీంతో అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. బీబీపేట సొసైటీకి 662 బస్తాల యూరియా వచ్చిందని తెలియగానే శుక్రవారం రాత్రే రైతులు తరలివచ్చి బారులు తీరారు. శనివారం ఉదయం వరకు వెయ్యి మందికి పైనే క్యూలో ఉన్నారు. సొసైటీ సిబ్బంది, వ్యవసాయ శాఖ అధికారులు, పోలీసులు సొసైటీ వద్దకు చేరుకొని ఎస్సై ప్రభాకర్ ఆధ్వర్యంలో టోకెన్ల పంపిణీని ప్రారంభించారు. ఈ క్రమంలో రైతుల మధ్య తోపులాట జరిగింది. పోలీసులనూ తోసేశారు. ఈ క్రమంలో గుర్తుతెలియని వ్యక్తి ఇటుక రాయిని కానిస్టేబుల్ నవీన్‌పైకి విసరడంతో అతడికి ఛాతీలో దెబ్బ తగిలింది. వెంటనే అతడిని పక్కనే ఉన్న ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దీంతో ఎస్సై పరిస్థితి చేయి దాటడంతో టోకెన్ల పంపిణీ ఆపేసి పోలీసు స్టేషన్‌కు వెళ్లారు. అక్కడికి చేరుకున్న రైతులు టోకెన్లను ఇవ్వాలని పట్టుబట్టడంతో అధికారులతో చర్చించి వరుస క్రమంలో రైతులను కూర్చోబెట్టారు. సొసైటీ వద్ద ఇచ్చిన టోకెన్లను రద్దు చేసి కొత్తవాటిని తయారు చేశారు. గంటల తరబడి వేచి చూడాల్సి రావడంతో రైతులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దోమకొండ పోలీసులతో పాటు సీఐ సంపత్ సైతం అక్కడకు చేరుకొని వారిని సముదాయించి, ఒక్కో రైతుకు ఒక టోకెన్ ఇచ్చారు. ఈ క్రమంలో మల్కాపూర్ గ్రామానికి చెందిన గట్కు రేఖయ్య అనే రైతుకు ఫిట్స్ రావడంతో అక్కడే ఉన్న రైతులు స్పందించి అతనికి సహాయం అందించారు. అతడిని పోలీసు వాహనంలో ఆస్పత్రికి తరలించారు. సొసైటీ వద్ద కూడా బారెడు రైతులు ఉండడంతో రైతులకు పొద్దంతా బస్తా యూరియా సంపాదించడంలోనే గడిచిపోయింది. మొత్తం వెయ్యి మంది రాగా శనివారం 662 టోకెన్లు ఇచ్చిన అధికారులు.. సోమవారం కోసం మిగిలిన వారికి టోకెన్లు అందించారు.



పోలీసులతో వాగ్వాదానికి దిగిన రైతులు



టోకెన్ల కోసం పోలీస్ స్టేషన్ వద్ద వరుసలో కూర్చున్న రైతులు

వీరంతా నేరస్తులు కాదు.. ఏ కేసుతోనూ సంబంధం లేదు.. యూరియా బస్తా కోసం రోజుల తరబడి సొసైటీ చుట్టూ తిరుగుతున్న అన్నదాతలు.. బీబీపేట సొసైటీలో బస్తాలు తక్కువగా ఉండడం.. ఎక్కువమంది రైతులు తరలిరావడం.. టోకెన్ల పంపిణీ సందర్భంగా తోపులాట జరగడం.. గుర్తు తెలియని వ్యక్తి పోలీసుపై రాళ్లు విసరడం.. దీంతో పరిస్థితి చేయి దాటుతోందని భావించిన పోలీసులు అందరినీ పోలీస్ స్టేషన్‌కు పిలిపించి ఇలా ఎండలో వరుసలో కూర్చోబెట్టి టోకెన్లు పంపిణీ చేశారు.

రెండే దొరికాయి



యూరియా కోసం రాత్రి వచ్చి ఇక్కడే పడుకున్నాను. రోజంతా ఉన్నా ఒకే బస్తా దొరికింది. నాలుగు ఎకరాల్లో నాట్లు వేస్తే ఇప్పటి వరకు రెండు బస్తాలు మాత్రమే దొరికాయి. ఎరువు వేయకపోవడంతో ఈసారి పంట దిగుబడులు వచ్చేలా లేవు.

– పిట్ల స్వామి, రైతు, మల్కాపూర్

యూరియా తెప్పించాలి



వరి పంటకు అసలు టైంలో యూరియా చల్లితేనే మంచి దిగుబడి వస్తుంది. కానీ ఎరువు దొరక్కపోవడంతో పంటకు వేయలేకపోతున్నాం. లేటుగా వేస్తే లాభం ఉండదు. ప్రభుత్వం స్పందించి అవసరమైన మేర యూరియాను తెప్పించాలి.

– బోయినపురం రమేశ్, సీతారాంపల్లి

రాష్ట్రస్థాయి పోటీల్లో చాంపియన్‌గా గాంధారి ఈఎంఆర్ఎస్



గాంధారి జట్టుకు బహుమతి అందజేస్తున్న మంత్రి సీతక్క, ఎస్పీ సుధీర్ రాంనాథ్‌కేకన్

కొత్తగూడ: మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం పొగుళ్లపల్లి ఈఎంఆర్ఎస్‌లో జరిగిన రాష్ట్రస్థాయి క్రీడల్లో కామారెడ్డి జిల్లా గాంధారి ఈఎంఆర్ఎస్ ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. శనివారం క్రీడల ముగింపు వేడుకలు నిర్వహించగా రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క హాజరై, మాట్లాడారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓడిన వారు నిరాశపడకుండా గెలుపుకోసం మరోసారి ప్రయత్నించాలన్నారు. అనంతరం ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించిన గాంధారి ఈఎంఆర్ఎస్‌కు, అలాగే వివిధ విభాగాల్లో గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేశారు. మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్‌కేకన్, ఆర్డీవో కృష్ణవేణి, స్పోర్ట్స్ ఆఫీసర్ వీర్యనాయక్, ఆర్సీవో రత్నకుమారి, రాష్ట్ర ఉపాధి హామీ సంస్థ డైరెక్టర్ చల్ల నారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ అజయ్‌సింగ్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు వేంకటేశ్వర ఆలయంలో కృష్ణాష్టమి వేడుక

- ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేత



దోమకొండ: మండల కేంద్రంలోని వేంకటేశ్వర ఆలయంలో ఆదివారం జరిగే కృష్ణాష్టమి వేడుకలకు శనివారం ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డికి ఆహ్వాన పత్రికను ఆలయ కమిటీ ప్రతినిధులు అందజేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు సందెల అబ్బయ్య, స్వామి, కానుగంటి రాజు, సిద్ధ రాములు, బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు చింతల రాజేష్, నాయకులు రవీందర్‌రెడ్డి తదితరులున్నారు. దోమకొండలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం జరిగే కృష్ణాష్టమి వేడుకలను ఆలయకమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ ప్రతినిధులు కోరారు.

పొదలతో అంగన్‌వాడీ ఆవరణ



నస్రుల్లాబాద్: మండలంలోని అంకోల్ గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రానికి ప్రహరీ లేదు. దీంతో పశువులు అంగన్‌వాడీ కేంద్ర ఆవరణలో వస్తున్నాయి. ఆవరణ ప్రాంతమంతా ముళ్లపొదలతో నిండి ఉంది. అంగన్‌వాడీ కేంద్రంలో మరుగుదొడ్లు లేక పోవడంతో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

వివాహిత అదృశ్యం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మాల్తుమ్మెద గ్రామానికి చెందిన ఓ వివాహిత అదృశ్యమైనట్లు ఎస్సై భార్గవ్‌గౌడ్ తెలిపారు. మండలంలోని మాల్తుమ్మెద గ్రామానికి చెందిన కర్రె రవికి, నాగిరెడ్డిపేటలకు చెందిన యువతితో కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్యాభర్తలు పిల్లలతో కలిసి గతేడాది జీవనోపాధి కోసం హైదరాబాద్ వెళ్లారు. అక్కడ దంపతుల మధ్య విబేధాలు తలెత్తడంతో భార్య బంధువుల ఇంటికి వెళ్లిపోయింది. నాగిరెడ్డిపేటలోని తన తల్లిగారింట్లో గత నెల 16న నిద్రించిన సదరు వివాహిత మరుసటి రోజు నుంచి అదృశ్యమైంది. ఇప్పటికీ ఆమె ఆచూకీ లభించకపోవడంతో వివాహిత తల్లి శనివారం నాగిరెడ్డిపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు వివాహిత అదృశ్యంపై కేసున మోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సైపేర్కొన్నారు.

తప్పిపోయిన చిన్నారి: తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు



కామారెడ్డి క్రైం: ఆడుకుంటూ ఇంటి నుంచి బయటకు వెళ్లి తప్పిపోయిన చిన్నారిని పట్టణ పోలీసులు గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించిన ఘటన జిల్లా కేంద్రంలోచోటు చేసుకుంది. వివరాలు ఇలా.. బీడీ వర్కర్స్ కాలనీకి చెందిన విభూతి దివ్య–రమేష్ దంపతులకు 4 ఏళ్ల కుమార్తె పల్లవి ఉంది. చిన్నారి శనివారం సాయంత్రం ఆడుకుంటూ బయటకు వెళ్లి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇందిరా నగర్ కాలనీ వద్ద స్థానికులు గమనించి చిన్నారిని పోలీసులకు అప్పగించారు. పట్టణ ఎస్‌హెచ్‌వో నరహరి చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగించారు. వారు పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు.

లోక్ అదాలత్‌లో భారీగా కేసుల పరిష్కారం







బిచ్కుంద కోర్టులో మాట్లాడుతున్న న్యాయమూర్తి వినీల్ కుమార్, ఎల్లారెడ్డి మున్సిఫ్ కోర్టులో ..న్యాయమూర్తి సుష్మ, బాన్సువాడ కోర్టులో.. న్యాయమూర్తి భార్గవి

బిచ్కుంద(జుక్కల్): బిచ్కుంద కోర్టులో న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. బిచ్కుంద కోర్టు న్యాయమూర్తి వినీల్ కుమార్ ఇరువర్గాల కక్షదారులకు మాట్లాడి లోక్ అదాలత్ కింద కేసులు పరిష్కరించారు. ఈ లోక్ అదాలత్‌లో 356 కేసుల పరిష్కరంకాగా, డ్రంక్ డ్రైవ్, సెటిల్మెంట్ ద్వారా రూ.23,67,360 రికవరీ చేశారు. న్యాయవాదులు లక్ష్మణరావు, మల్లేశ్వర్, విఠల్‌రావు, ప్రకాష్, విఠల్, బిచ్కుంద ఎస్సై మోహన్‌రెడ్డి, మద్నూర్ ఎస్సై విజయ్‌కొండ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి మున్సిఫ్ కోర్టులో ..

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిఫ్ కోర్టులో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి సుష్మ నిర్వహించారు. ఈ లోక్ అదాలత్‌లో 441 కేసుల పరిష్కరంకాగా, సెటిల్మెంట్ ద్వారా రూ.13,98,145 రికవరీ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు గోపాల్‌రావు, పండరి, శ్రీనివాస్, నవీద్, సాయిప్రకాష్ , శ్రీకాంత్, సాయిబాబా, సతీష్, ఎక్సైజ్‌సీఐ షాకీర్ అహ్మద్ తదితరులున్నారు.

బాన్సువాడ కోర్టులో..

బాన్సువాడ రూరల్: లోక్ అదాలత్‌తో కేసులు సత్వర పరిష్కారం అవుతాయని బాన్సువాడ సివిల్‌కోర్టు న్యాయమూర్తి టీఎస్‌పీ భార్గవి అన్నారు. కోర్టు ఆవరణలో లోక్ అదాలత్ నిర్వహించి మాట్లాడారు. ఈ లోక్ అదాలత్‌లో 300 కేసుల పరిష్కరం కాగా, సెటిల్మెంట్ ద్వారా రూ.16,23, 222 రికవరీ చేశారు.ఈకార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రసిడెంట్ మోహన్‌రెడ్డి, న్యాయవాదులు ఖలీల్, దత్తాత్రేయ, మోగులయ్య, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



డోంగ్లీలో మాట్లాడుతున్న నాయకులు



రాజంపేటలో మాట్లాడుతున్న సట్టిగారి లక్ష్మి

మద్నూర్(జుక్కల్): కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జీ మంథని సామ్యేల్ డిమాండ్ చేశారు. డోంగ్లీ మండల కేంద్రంలో శనివారం ఆయన ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 22 నెలలు గడుస్తున్నా .. దివ్యాంగులకు రూ. 6 వేల పింఛన్, వృద్ధులు, వితంతువులు చేయూత పెన్షన్‌దారులకు రూ.4 వేల పింఛన్‌ను ఇవ్వడంలేదని విమర్శించారు. 15న దివ్యాంగుల పెన్షన్‌దారులతో తహసీల్ కార్యలయాన్ని ముట్టడిస్తామన్నారు. ఈ నెల 14న సరిహద్దులోని దేగ్లూర్‌కు మందకృష్ణ మాదిగ వస్తున్నారని ఆయన తెలిపారు.నాయకులు పెద్దబూరి గంగారం, మండల అధ్యక్షుడు, మారుతి, హన్మంత్, రాహుల్, శివాజీ, చందు, భీంరావ్, అరవింద్, తుకారం తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ముట్టడిని విజయవంతం చేయాలి

రాజంపేట: రాష్ట్ర ఎమ్మార్పీస్ ఆదేశాల మేరకు ఈ నెల 15న నిర్వహించే తహసీల్దార్ కార్యాలయాల ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీస్ జిల్లా అధ్యక్షులు సట్టిగారి లక్ష్మి డిమాండ్ చేశారు. శనివారం రాజంపేట మండల కేంద్రంలోని స్థానిక పెద్దమ్మ ఆలయ ప్రాంగణంలో దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ మండల అధ్యక్షులు జి. రాజు, భాస్కర్, నరేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర ఆలయంలో పూజలు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని శ్రీవేంకటేశ్వర ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం చుట్టు తిరుగుతూ పల్లకీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. సదాశివుడు, గంగారాం, రాజిరెడ్డి, రాంచంద్రర్‌రావు, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

సమాచారం

నేడు ఎల్లారెడ్డిలో రక్తదాన శిబిరం

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డిలోని మైనారిటీ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ఐఎంఎఫ్, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తలసేమియా బాధితుల కోసం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు.

నేడు శ్రీసత్యసాయి టెలి మెడిసిన్ సేవలు

కామారెడ్డి అర్బన్: శ్రీసత్యసాయి సేవా ఆర్గనైజేషన్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శ్రీసత్యసాయి ప్రాణమిత్ర ఉచిత టెలి మెడిసిన్ సేవలు వినియోగించుకోవాలని ప్రతినిధులు కోరారు. 080–47179797 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించవచ్చన్నారు. 25 మంది వివిధ వైద్యనిపుణులు అందుబాటులో ఉంటారని, ఎలాంటి వ్యాధులకైనా సంప్రదించవచ్చన్నారు.

దోమకొండ మండల అర్చక పురోహిత సంఘం నూతన కార్యవర్గం

దోమకొండ: దోమకొండ మండల అర్చక పురోహిత సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా భావి కృష్ణమూర్తి శర్మ, ఉపాధ్యక్షులుగా వెంకటేశ్వరశర్మ, భావి సాయిచంద్రశర్మ, కోశాధికారిగా భావి శరత్‌చంద్రశర్మ, ప్రధాన కార్యదర్శిగా కమల్‌కాంత్‌శర్మ, కార్యదర్శులుగా రామకృష్ణశర్మ, సలహాదారులుగా వసంత్‌శర్మ, శ్రీనివాస్‌శర్మ, శ్రీనివాస్‌శర్మ, రామకృష్ణ, సనత్‌కుమార్‌శర్మ, సతీష్‌శర్మలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామన్నారు.

మద్నూర్‌లో మళ్లీ చిరుత పులి అలజడి..!



మద్నూర్ శివారులో పులి ఉందని గుమిగుడిన గ్రామస్తులు



పులిని చూశానని చెబుతున్న రైతు పరశురాం

మద్నూర్(జుక్కల్): చిరుత పులిపై సంచారంపై మద్నూర్‌లో ప్రజల్లో ఆందోళన నెలకొంది. శనివారం చిరుత పులిని చూశానంటూ రైతు పరశురాం భయంతో పరుగులు తీసి మద్నూర్‌లో పలువురికి చెప్పడంతో గ్రామస్తులు తండోపతండాలుగా చిరుత పులి ఉన్న ప్రదేశానికి తరలివెళ్లారు. మండల కేంద్రానికి సమీపంలోని సోనాల గ్రామానికి వెళ్లె రహదారి పక్కన చిరుత పాద ముద్రల కోసం జుక్కల్ రేంజ్ ఫారెస్టు అధికారిణి సుజాత ఆధ్వర్యంలో సిబ్బంది వెతికారు. ఈసందర్భంగా సుజాత మాట్లాడుతూ చిరుత పులిపై ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మండల కేంద్రంలో చిరుత పులి వచ్చిందని సమాచారం మేరకు ఆమె, సిబ్బందితో కలిసి పంట చెలల్లో పరిశీలించారు. మూడు రోజుల క్రితం చిరుతపులి కనిపించిందని పుకార్లు షికార్లు కావడంతో అటవీశాఖ అధికారులు అది పులి కాదు అడవి పిల్లి అని తేల్చడంతో అందరు ఊపిరిపిల్చుకున్నారు. శనివారం చిరుత కనిపించిందని చెబుతున్న చోట పులికి సంబంధించిన ఆనవాళ్లు లేవని జుక్కల్ రేంజ్ ఫారెస్టు అధికారిణి సుజాత అన్నారు. చిరుత పులి గోళ్లు పొడువుగా ఉంటాయని మద్నూర్ శివారులో కనిపించిన గుర్తులు అలా లేవని ఆమె అన్నారు.మద్నూర్, సోనాల, పెద్ద శక్కర్గా గ్రామాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఆయా గ్రామాల్లో చాటింపు వేయించాలని జీపీ సిబ్బందికి సూచించామన్నారు. మద్నూర్ శివారులో ఉన్న వ్యవసాయ భూమిలో గల రేకులషెడ్డు వద్ద సీసీ కెమెరాలు ఉన్నాయని ఆదివారం సీసీ పుటేజీని పరిశీలిస్తామన్నారు.

చిరుత పులిని పట్టుకోవాలని రోడ్డుపై ధర్నా



మద్నూర్‌లో ధర్నా చేస్తున్న గ్రామస్తులు

మద్నూర్(జుక్కల్): చిరుత పులిని పట్టుకోవడంలో అటవీశాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని మండల కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద శనివారం ప్రధాన రోడ్డుపై గ్రామస్తులు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. శనివారం మద్నూర్‌కు చెందిన రైతుకు చిరుతపులి కనిపించిందని చెప్పినా పట్టించుకోకపోవడం ఏమిటని వారు ప్రశ్నించారు. అటవీశాఖ అధికారులు డ్రోన్ కెమెరాలు ఉపయోగించి సిబ్బందితో చిరుతపులిని పట్టుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామస్తులు, రైతులున్నారు.

బాధితులకు జాజాల పరామర్శ

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో అనారోగ్యంతో మృతి చెందిన అనురాధా కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ శనివారం పరామర్శించారు. అనురాధా అనారోగ్యంతో మృతి చెందడం బాధ కలిగించిందని సురేందర్ అన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు సతీష్, నర్సింలు, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

తొట్టెలో పడి బాలుడు మృతి

- మద్నూర్‌లో చోటుచేసుకున్న విషాద ఘటన
- కన్నీరుమున్నీరవుతున్న తల్లిదండ్రులు




అక్షయ్ (ఫైల్)

మద్నూర్(జుక్కల్): నీటి తొట్టిలో పడి బాలుడు ప్రాణాలు వదిలాడు. కామారెడ్డి జిల్లా మద్నూర్ మండల కేంద్రంలో శనివారం ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఇందిర నగర్ కాలనీకి చెందిన మేత్రివార్ రాజు, అనిత దంపతులు మద్నూర్‌లోని పాత బస్టాండ్‌లో టీ పాయింట్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రాజు టీ పాయింట్‌లో ఉండగా, అనిత ఇంట్లో వంట చేస్తోంది. వీరికి ఇద్దరు కొడుకులు ఉండగా చిన్న కొడుకు అక్షయ్ (2) ఇంటి ముందు ఆడుకుంటూ నీటి తొట్టె వద్దకు వెళ్లాడు. అక్షయ్ చేతిలో ఉన్న ఆట వస్తువు నీటి తొట్టెలో పడటంతో దాన్ని తీసుకోవడానికి వంగడంతో బ్యాలెన్స్ తప్పి తల నీటి తొట్టెలోకి పడిపోయి కాళ్లు బయటకు తేలాయి. కొద్ది సేపటికి తల్లి అనిత బయటకు వచ్చి చూడగా అక్షయ్ నీటి తొట్టెలో కనిపించాడు. బాలుడిని నీటి తొట్టెలోంచి బయటకు తీసి స్థానికులతో కలిసి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అల్లారు ముద్దుగా పెంచుకున్న కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజయ్‌కొండ తెలిపారు.

జీజీహెచ్‌లో నవజాత శిశువు మృత్యువాత

- ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టిన బంధువులు



మృతి చెందిన శిశువు

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో అప్పుడే పుట్టిన శిశువు మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యం వల్లే మృతి చెందిందని శిశువు కుటుంబీకులు, బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళన నిర్వహించారు. వివరాలు ఇలా.. తాడ్వాయి మండలం బ్రహ్మాజీవాడికి చెందిన అఖిల పురిటి నొప్పులు రావడంతో శుక్రవారం సాయంత్రం కామారెడ్డి జీజీహెచ్‌కు వచ్చింది. వైద్యులు అర్ధరాత్రి ఆమెకు ప్రసవం చేశారు. ఆడపిల్ల పుట్టడంతో మహాలక్ష్మి పుట్టిందనే కుటుంబ సభ్యుల సంబరం కొద్దిసేపటికే ఆవిరైంది. మృత శిశువు జన్మించిందని వైద్యులు చెప్పారు. దీంతో బంధువులు వైద్యులతో వాగ్వాదానికి దిగారు. కాలయాపన చేయకుండా ఆపరేషన్ చేసి ఉంటే శిశువు బతికేదని కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో ఆందోళన చేశారు. పట్టణ పోలీసులు ఆస్పత్రికి వచ్చి వారిని సముదాయించారు. ఈ విషయమై ఆస్పత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లును వివరణ కోరగా వైద్యుల నిర్లక్ష్యం లేదన్నారు. ఉమ్మనీరు మింగడంతోనే శిశువు మృతి చెందిందని తెలిపారు.

పోలీసుల విధులకు ఆటంకం: కేసు నమోదు

నవీపేట: పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి శనివారం తెలిపారు. మూడు రోజుల కిందట మండల కేంద్రానికి చెందిన ఒక వర్గానికి చెందిన యువకుడు ప్రార్థనా మందిరంపై జెండాను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో షేర్ చేశాడు. ఇది వైరల్‌గా మారడంతో ఆగ్రహానికి గురైన మరో వర్గానికి చెందిన యువకులు పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఆందోళన చేశారు. ఈక్రమంలో వారు పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది విధులకు ఆటంకం కలిగించారు. ఆరుగురితో పాటు మరికొందరిపై కేసు నమోదు చేశారు.

ర్యాగట్లపల్లిలో గుప్తనిధుల కోసం తవ్వకాలు!



పోలీసుల అదుపులో ఉన్న నిందితులు



ర్యాగట్లపల్లిలోని బసవేశ్వరాలయం

- నిందితులను పట్టుకున్న గ్రామస్తులు
- ఎనిమిది మందిపై కేసు నమోదు చేసిన పోలీసులు

భిక్కనూరు: మండలంలోని ర్యాగట్లపల్లి గ్రామంలో గల బసవేశ్వరాలయం ప్రాంతంలో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరుపుతున్న వ్యక్తులను గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. ర్యాగట్లపల్లి గ్రామంలో శిథిలావస్థకు చేరుకున్న అతిపురాతనమైన బసవేశ్వరాలయం ప్రాంతంలో శనివారం వేకువజామున ప్రొక్లెయిన్ సహాయంతో కొందరూ గుప్తనిధుల కోసం తవ్వకాలను ప్రారంభించారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు అక్కడికి వెళ్లి పనులను అడ్డుకున్నారు. గ్రామస్తులు ప్రశ్నించగా దురుసుగా సమాధానాలు చెప్పడంతో వారిని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని నిందితులైన ర్యాగట్లపల్లి గ్రామానికి చెందిన చిన్న భూమయ్య, మహేందర్, మంత్రి దుర్గయ్య, రామాయంపేట, భిక్కనూర్‌కు చెందిన సభావత్ భరత్, నాగభూషణం, యాదగిరి, వెంకట చంద్రశేఖర్, నెల్లూరి కాంతారావులను అదుపులోకి తీసుకున్నారు. గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అంజనేయులు వివరించారు.

సదాశివనగర్‌లో సైబర్‌మోసం

- ఫోన్ హ్యాక్ చేసి ఓ వ్యాపారి ఖాతా నుంచి సుమారు రూ. 8 లక్షలు కాజేసిన వైనం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలకేంద్రంలో ఓ వ్యాపారి ఫోన్‌ను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేసి, సుమారు రూ.8లక్షల వరకు కాజేశారు. బాధితుడు తెలిపిన వివరాలు ఇలా.. మండల కేంద్రానికి చెందిన కొడిప్యాక శ్రీనివాస్ గత కొంతకాలంగా జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాలకు, వసతి గృహాలకు నిత్యవసర సరుకులను పంపిణీ చేసే టెండర్‌ను దక్కించుకుని, సరుకులను సరఫరా చేస్తుంటాడు. ఈక్రమంలో గత నెల 30న తన ఖాతాలో సరుకులకు సంబంధించి డబ్బులు జమ అయినట్లు మెసేజ్ వచ్చింది. ఈ నెల 6న తన ఫోన్ తరచూ వేడి కావడంతో ఇట్టి విషయాన్ని పోలీసులకు తెలిపాడు. పోలీసులు ఫోన్ హ్యాక్ అయిందని, వెంటనే సిమ్‌ను వేరే ఫోన్‌లో వేసుకోమని చెప్పడంతో అతడు అలానే చేశారు. మరుసటి రోజు తన ఖాతా నుంచి డబ్బులను తీసుకుందామని కామారెడ్డిలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌కు వెళ్లగా గతంలోనే రూ.4లక్షల 50వేలు, రూ.4లక్షల 27వేలు ఎలాంటి మెసేజ్ లేకుండా డ్రా అయినట్లు చూపించింది. దీంతో ఇదేమిటని బ్యాంక్ అధికారులను ప్రశ్నించగా ఇది సైబర్ నేరగాళ్ల పని అని గుర్తించి వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయమని చెప్పారు. సదరు వ్యాపారి ఈ నెల 9న సదాశివనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వ్యాపారి తెలిపారు.

ఆటోలు చోరీ చేసే ముఠా అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రాజేశ్ చంద్ర

కామారెడ్డి క్రైం: ఆటోల చోరీలకు పాల్పడుతున్న ఓ ముఠాను నాగిరెడ్డిపేట పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. జిల్లాకేంద్రంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ రాజేశ్ చంద్ర వివరాలు వెల్లడించారు. నాగిరెడ్డిపేట మండలం గోపాల్‌పేటకు చెందిన తాడేపల్లి కృష్ణ ఆటో ఈ నెల 11న చోరీకి గురైంది. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. శనివారం ఉదయం మాల్తుమ్మెద వద్ద పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా ఆటోలో పారిపోబోయిన ఇద్దరిని పట్టుకుని విచారించారు. దీంతో ఆటోల చోరీ వ్యవహారం బయటపడింది. నిందితులను నిజామాబాద్ జిల్లా మంచిప్పకు చెందిన కుమ్మరి రాజు, కొల్ల దుర్గరాజులుగా గుర్తించారు. వారిలో కుమ్మరి రాజుపై గతంలో కరీంనగర్, జగిత్యాల, మెదక్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల పరిధిలో మొత్తం 20 దొంగతనం కేసులు ఉన్నాయని ఎస్పీ తెలిపారు. వాటిలో ఎక్కువగా ఆటోల చోరీ కేసులే ఉన్నాయన్నారు. దుర్గరాజుపై గతంలో ఒక ఆటో చోరీ కేసు ఉన్నట్లు వెల్లడించారు. నిందితుల వద్ద నుంచి నాగిరెడ్డిపేటలో దొంగిలించిన ఆటోతో పాటు మెదక్ జిల్లాలో దొంగిలించిన 2 ఆటోలు, భిక్కనూర్‌లో ఎత్తుకెళ్లిన మరో ఆటోను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నామని ఎస్పీ తెలిపారు. నిందితులను పట్టుకున్న కానిస్టేబుల్ గంగారాం, హోంగార్డు బాలాజీలను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. కామారెడ్డి ఏఎస్పీ చైతన్య రెడ్డి, ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్ రావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో మూడు గేదెలు..

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని భవానిపేట గ్రామ శివారులో విద్యుత్ షాక్‌తో మూడు గేదెలు మృతి చెందినట్లు లైన్‌మెన్ పాండు తెలిపారు. గ్రామానికి చెందిన మాదిగ బాలయ్య పొలం వద్ద బోరు మోటారు సర్వీస్ వైరు తెగిపోయి ఫినిషింగ్ వైర్‌పై పడింది. ఈక్రమంలో శనివారం అదే గ్రామానికి చెందిన ఆకుల సురేందర్, గుండ్ర సత్యనారాయణ, గుండ్ర పరంధాములుకు చెందిన గేదెలు గ్రామ శివారులోకి మేతకు వెళ్లాయి. దీంతో గేదెలు మేత మేసుకుంటూ వెళ్లగా ఫినిషింగ్ వైరు తగిలి అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. గేదెల విలువ సుమారు రూ. 3లక్షలు ఉంటుందన్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

చికిత్సపొందుతూ వృద్ధురాలు..



నట్ట అనసూయ(ఫైల్)

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ప్రమాదవశాత్తు గాయపడిన ఓ వృద్ధురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఎస్సై భార్గవ్‌గౌడ్ తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని నాగిరెడ్డిపేట గ్రామానికి చెందిన నట్ట అనసూయ(79) అనే వృద్ధురాలు గత నెల 28న కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఇంటి బయటకు వెళ్లి కాలుజారి నేలపై పడిపోయింది. దీంతో ఆమెకు తీవ్ర గాయాలు కావడంతో కుటుంబసభ్యులు గమనించి చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు.అనంతరం మెరుగైన వైద్యం కోసం ఈ నెల 3న మెదక్‌లోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి, అక్కడి నుంచి ఈ నెల 8న హైదరాబాద్ లోని నిమ్స్‌కు తరలించి చికిత్స చేయించారు. కాగా ఈ నెల 12న ఆమె ఆ స్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి మనువడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని 41 గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఎంపీడీవో నరేశ్ సూచించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో కార్యాలయంలో కార్యదర్శుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. భారీ వర్షాల నేపథ్యంలో మురికి కాల్వలు, వీధుల్లో రోడ్లపై మురికి నీరు నిల్వకుండా, చెత్తా చెదారం వీధుల్లో లేకుండా చూడాలన్నారు. అలాగే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎంపీవో మలహరి, ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

బుచ్చన్న మరణం తీరని లోటు

భిక్కనూరు: ఆర్యసమాజ్‌మందిరం వ్యవస్థాపకుడు గువ్వ బుచ్చయ్య మరణం ఆధ్యాత్మికతకు తీరని లోటు అని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డిలు అన్నారు. శనివారం వారు భిక్కనూరు మండలం జంగంపల్లి గ్రామానికి వెళ్లి ఇటీవల మృతి చెందిన విండో మాజీ చైర్మన్ గువ్వ బుచ్చయ్య కుటుంబాన్ని పరమార్శించారు. బ్రహ్మజ్ఞాన ఆశ్రమం, శ్రీకృష్ణమందిరం నిర్మాణానికి బుచ్చయ్య ఎంతగానో శ్రమించాడని కొనియాడారు. కాంగ్రెస్ నేతలు బల్యాల సుదర్శన్, అందె దయాకర్‌రెడ్డి, కల్లూరి సిద్దరాములు, లింబాద్రి,నరేష్ ,మూర్తి, ప్రకాశ్, సిద్దరాములు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ అధికారులు ప్రజలను అప్రమత్తం చేయాలి

భిక్కనూరు: మండలంలో కురుస్తున్న వర్షాలకు పురాతన ఇళ్లు కూలిపోతున్నాయని అందులో నివసిస్తు ప్రజలను అధికారులు అప్రమత్తం చేయాలని భిక్కనూరు మండల బీఆర్‌ఎస్ మహిళ విభాగం అధ్యక్షురాలు దేవర లక్ష్మి అన్నారు. శనివారం ఆమె భిక్కనూరులో విలేకరులతో మాట్లాడుతూ మండలంలో ఇటీవల గోడ కూలి జాగిరిసింగ్ మృతి చెందడంతో ఆయన కుటుంబం వీధిన పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలకు నష్టపోయిన వారిని పార్టీలకతీతంగా అన్ని పార్టీల వారు ముందుకు వచ్చి ఆదుకోవాలన్నారు.

పలు గ్రామాలలో హెల్త్ క్యాంపులు



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మండలంలోని పలు గ్రామాలలో శనివారం మత్తమాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది హెల్త్ క్యాంపులు నిర్వహించారు. మండలంలోని దావల్‌మల్కపల్లి, మల్లయ్యపల్లి గ్రామాలలో ఆరోగ్య సిబ్బంది ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులను అందించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శరత్, ఆరోగ్య సిబ్బంది తదితరులున్నారు.